# కులగీతం విశేషాలు

రాష్ట్రియ సంస్కృత విశ్వవిద్యాలయం సనాతన భారతీయ జ్ఞాన, విజ్ఞాన, సంస్కృతుల వాహికగా నిలిచిన సంస్కృతభాష యొక్క ప్రసార ప్రచారాలకై నిరంతరం కృషి చేస్తున్న కేంద్రీయ విశ్వవిద్యాలయం. కేంద్రీయ విద్యాపీఠంగా ఉన్నప్పుడు, రాష్ట్రియ సంస్కృత విద్యాపీఠంగా ఉన్నప్పుడు కులగీతాలు ఉన్నాయి. భారతప్రభుత్వం ఈ విశ్వవిద్యాలయాన్ని కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంగా ఉన్నతీకరించిన తరువాత ప్రస్తుత కులగీతాన్ని అధ్యాపకులందరూ కలసి భారతీయ వేదధర్మభావనల సుగంధంగా, సప్తగిరీశుని చరణాల చెంత సప్తచరణాలంకృతంగా అక్షరీకరించారు.

పల్లవి

**తమసో మా జ్యోతిర్గమయా........ సం వో మనాంసి జానతామ్**

తమసోమా జ్యోతిర్గమయ, జాగృయామ పురోహితాః, తేజస్వినావధీతమస్తు, సం వో మనాంసి అనే వేదవాక్యాలలోని ఉదాత్తమైన భావాలు అందరిలోనూ పల్లవించాలని ఆకాంక్షిస్తూ వేదోపనిషత్ రాసూక్తులతో ఈ పల్లవి కూర్చబడింది.

1. **శ్రీపతిగిరిపదసన్నిధి....నూతనైరుత**

   సప్తగిరిసార్వభౌముడు, కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీనివాసుడు విలసిల్లుతున్న తిరుమలగిరి పాదాల చెంత(తిరుపతిలో) సంస్కృతవిద్యాపీఠంగా స్థాపించబడి ఇంతింతై వటుడింతై అన్న చందాన నేడు భారతప్రభుత్వంచే జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చెంది ప్రాచీనులచేత ఆధునికుల చేత కీర్తింపబడుతూ ఉంది.

2. **రాష్ట్రియజన... .. సాహితీతత్త్వచింతనైః**

   వ్యాకరణం, జ్యోతిషం, న్యాయం, సాహిత్యం ( సంస్కృతం, హిందీ, తెలుగు, ఆంగ్లం) మొదలైన శాస్త్ర, సాహిత్యవిషయాలలో లోతైన ప్రామాణిక పరిశోధనలు చేసి సమాజానికి జ్ఞానామృత సారాన్ని అందించిన విశ్వవిద్యాలయంగా ఈ సంస్థ విరాజిల్లుతోంది.

3. **ఛాత్రమతీనాం..... ఖలు కులప్రధానాః**

   అనేకశాస్త్రాలలో అపారమైన పాండిత్యం కల్గిన ప్రథమకులపతులు మహామహోపాధ్యాయ రామానుజతాతాచార్యుల వారి శాస్త్రబోధనతో విద్యార్థుల హృదయాలు ఆహ్లాదమయం అయ్యాయి. (ప్రహ్లాదాచార్యులు గారు ఈ విశ్వవిద్యాలయం యొక్క పూర్వకులపతులు). మహామహోపాధ్యాయ పట్టాభిరామశాస్త్రి గారు, అర్థశాస్త్రనిపుణులు, రాష్ట్రపతి సమ్మానితులు డా. వి. ఆర్. పంచముఖి

గారు, ఒరిస్సా రాష్ట్ర పూర్వ ముఖ్యమంత్రి, అస్సాం పూర్వ గవర్నర్ జె.బి.పట్నాయిక్ గారు, పద్మభూషణ పురస్కృతులు, భారతదేశ పూర్వ ప్రధాన ఎన్నికల కమీషనర్ ఎన్. గోపాలస్వామి గారు మొదలైన ఎందరెందరో ప్రముఖుల్ని కులాధిపతులుగా కలిగి ఈ విశ్వవిద్యాలయం విరాజిల్లుతోంది.

4. బాలగోకులాత్....ధ్యేయం భవతి.

బుడిబుడినడకల చిన్నారులకు బాలగోకులం నుండి బుద్ధివైశారద్యం కలిగిన పండితులకు విద్యావారిధి వరకు అనేక ప్రమాణపత్రాలని విజయవంతంగా ఆ యా తరగతుల్ని పూర్తి చేసిన విద్యార్థులకి ఈ విశ్వవిద్యాలయం అందిస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆబాలగోపాలాన్ని జ్ఞానవంతులుగా తీర్చిదిద్దతున్న సంస్థ. **“భారతస్య ప్రతిష్ఠే ద్వే సంస్కృతం సంస్కృతిస్తథా”** అన్న నానుడి ప్రకారం సనాతన భారతీయ జ్ఞానమాధ్యమమైన సంస్కృతభాషాబోధన, సంస్కృతి పరిరక్షణలే ఈ విశ్వవిద్యాలయం యొక్క ప్రధాన ధ్యేయాలు.

5. శిష్యాః కేచితే.... పరస్పరం సంభాషన్తే.

ఈ విశ్వవిద్యాలయంలో అధ్యయనం చేసిన వారు, ఉద్యోగించిన వారు కొందరు దేశంలోని అనేక విశ్వవిద్యాలయాలకు కులపతులు అయ్యారు. మహామహోపాధ్యాయ రామానుజ తాతాచార్యులు, ఆచార్య మహదేవన్ గారు, ఆచార్య కె.వి. రామకృష్ణశాస్త్రి గారు, ఆచార్య కె.ఇ. గోవిందన్ గారు, ఆచార్య శ్రీపాద సత్యనారాయణ మూర్తి గారు, ఆచార్య ఎం.ఎల్.ఎన్. మూర్తి గారు, ఆచార్య విష్ణుపోథి, ఆచార్య విరివెంటి మురళీధర శర్మ గారు, ఆచార్య ఆర్. దేవనాథన్ గారు, ఆచార్య గుళ్ళపల్లి శ్రీరామకృష్ణమూర్తి గారు, ఆచార్య సన్నిధానం సుదర్శన మూర్తి గారు, ఆచార్య కె.ఇ. దేవనాథన్ గారు, ఆచార్య రాధాకాంత్ ఠాకూర్ గారు, ఆచార్య రాణి సదాశివమూర్తి గారు, ఆచార్య శ్రీనివాస వర్ఖేడి గారు, ఆచార్య ప్రహ్లాద్ జోషీ గార్లు. ఇలా పదిహేడు మంది కులపతుల్ని అందించిన ప్రసిద్ధమైన విశ్వవిద్యాలయంగా విలసిల్లుతోంది.

6. యోగే గణితే.... ప్రాక్తన విజ్ఞానదర్శనే

యోగ, గణితం, కంప్యూటర్, సంగీతం, పరిశోధనలు, అనువాదం, క్రీడారంగం, ప్రాచీన భారతీయ విజ్ఞాన ప్రదర్శన మొదలైన అనేక విషయాలతో విరాజిల్లుతున్న విశ్వవిద్యాలయం. క్రొత్త పాతల మేలు కలయిక అన్నట్లుగా ఇక్కడ ప్రాచీన, ఆధునిక విషయాల అనుసంధానాత్మక అధ్యయనం జరగడం విశేషం.

7. **జనతా సమతా... సంవదధ్వమ్**

విద్య పరమ లక్ష్యం తన చుట్టూ ఉన్న వారిని తన కుటుంబ సభ్యులుగా భావించి ప్రేమానురాగాలను పంచేవారిగా మార్చటం. భారతీయులం మనం అందరం అనే జాతీయతా భావాన్ని పెంపొందించడానికి ఈ విశ్వవిద్యాలయం కృషి చేస్తుంది. "**సహనౌ భునక్తు, నాపి ద్వేషః నవానురాగః, సంగచ్ఛధ్వం సంవదధ్వం**" అనే వేదసూక్తుల ప్రశస్తిని చాటి చెప్పడమే కాకుండా వాటిని అన్వయించి సమాచారణలోకి తెచ్చేందుకు ఈ విశ్వవిద్యాలయం కృషి చేస్తుంది.